మనిషి ఒంటరిగా బతకలేడు. బాల్యంలో మరీనూ! అన్నం కోసం అమ్మ, రక్షణ కోసం నాన్న... ఇలా ఏదో ఒక తోడు కావాల్సిందే. ఊహ తెలుస్తున్న కొద్దీ... తన ఈడువాళ్లతో కలిసే లోకాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆటపాటలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, కాలక్షేపం, చదువు... ఇలా అన్నిటిలోనూ ఎవరో ఒక వ్యక్తితో కలిసే అడుగు ముందుకు వేస్తాడు. అందుకే రెండేళ్ల వయసుకే స్నేహాలు ఏర్పడతాయని అంచనా వేస్తున్నారు సైకాలజిస్టులు. 'ఆడుకుందామా!' అన్న మాటతోనే ఆ అనుబంధాలు మొదలవుతాయి. ఈ వయసులో కలిసి కాలం గడపడమే కానీ స్పర్థ కనిపించదు. కానీ కాస్త వయసు పెరుగుతున్న కొద్దీ స్నేహం సంక్లిష్టం అవుతుంది. ఒకరిపై మరొకరు ఆధిపత్యం చూపించే ప్రయత్నం, చిన్నచిన్న గొడవలు మొదలైపోతాయి. వాటిని దాటుకుని ఫ్రెండ్‌షిప్ సాగుతుంది.

బడిలో ఒక్కో తరగతి దాటేకొద్దీ స్నేహంలోనూ మార్పులు వస్తాయి. తనకంటూ ఒక వ్యక్తిత్వం ఏర్పరచుకున్నాక... దానికి నప్పేవారినే స్నేహితులుగా ఎంచుకుంటారు. తల్లిదండ్రుల ప్రభావానికి దీటుగా, స్నేహితుల పాత్ర ఉంటుంది. ఇక టీనేజీలోకి వచ్చిన తర్వాత స్నేహితులదే పైచేయిగా మారుతుంది. ప్రతిదాన్నీ ప్రశ్నించాలి, ఎదురు తిరగాలి అనే తత్వంలో తమకు ఏదన్నా సమస్య వచ్చినా, బాధ కలిగినా స్నేహితులనే ముందుగా సంప్రదిస్తారు టీనేజర్లు. అది తప్పోఒప్పో కాదు... హార్మోన్ల ప్రభావం! ఇక జీవితంలో స్థిరపడిన తర్వాత స్నేహితుల సంఖ్య, చటుక్కున మిత్రులను చేసుకునే అలవాటు తగ్గిపోతుంది. ఉన్నత చదువులు, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు, కెరీర్... గోల మధ్య పాతమిత్రులు కూడా క్రమంగా దూరమవుతారు. వైవాహిక బంధానికి ఎక్కడ ఇబ్బంది కలుగుతుందో అని స్త్రీపురుషుల మధ్య స్నేహాలు కూడా కొంచెం పలచబడతాయి. ఇక జీవిత చరమాంకంలో స్నేహితుల ప్రాముఖ్యం మరింత పెరుగుతుంది. పిల్లలు, ఉద్యోగం దూరమైన ఒంటరితనం; జీవిత భాగస్వామి దూరం కావడం లాంటి సందర్భాలు గోడు పంచుకునే తోడు ఉంటే బాగుండు అనిపిస్తాయి.

ఇవన్నీ కూడా ఉజ్జాయింపుగా చెప్పుకొన్న మాటలు కాదు. మానవ బంధాలను పరిశీలించిన పరిశోధకుల విశ్లేషణ. మన బతుకుబాటలో స్నేహం తీరును గుర్తుచేసుకునే ప్రయత్నం. కానీ స్నేహితుల సంఖ్య ఒకప్పటిలా ఉండటం లేదు అన్నది తాజా వాస్తవం.



### కబుర్లు కలబోసుకునేలా

**మాతృదినోత్సవం, పితృదినోత్సవం లాంటి రోజుల వెనుక ఏదో ఒక మనసును కదిలించే కథ వినిపిస్తుంది. కానీ స్నేహితుల దినోత్సవాన్ని పక్కా వ్యాపార ధోరణితోనే ప్రోత్సహించిన దాఖలాలు ఉన్నాయి. హాల్మార్క్ గ్రీటింగ్ కార్డుల యజమాని జోస్ హాల్ మొదలుపెట్టిన ఆలోచన ఇది. దాన్ని మొదట్లో చిన్నచిన్న సంస్థలే ప్రోత్సహించినా... కొన్నాళ్లకు ఏకంగా ఐక్యరాజ్యసమితి ఆమోదించడంతో ప్రపంచాన్ని చుట్టేసింది. ఈ స్నేహితుల దినోత్సవాన్ని వేర్వేరు దేశాలు వేర్వేరు సమయాల్లో పాటిస్తాయి. ప్రేమికుల దినోత్సవం రోజునే స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహించే దేశాలూ ఉన్నాయి. మనం మాత్రం ఆగస్టు మొదటి ఆదివారాన్ని స్నేహితులను తల్చుకునేందుకు కేటాయించేశాం. ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని కంపెనీలూ ఫ్రెండ్‌షిప్ డేను అమ్మకాల కోసం వాడుకోవచ్చు గాక. కానీ స్నేహానికి వ్యాపారం అంటుకోదు కదా! అందుకే మిత్రులంతా కలసిమెలసి కబుర్లు కలబోసుకునేలా ఈ రోజు ప్రోత్సహిస్తుంది.**

### స్నేహితులే లేరు!!!

2019లో YouGov అనే సంస్థ చేసిన సర్వేలో ఇప్పటి తరం కుర్రాళ్లలో 30 శాతం మంది తాము ఒంటరితనాన్ని అనుభవిస్తున్నామని చెప్పారు. అందుకు ముఖ్య కారణం స్నేహితులు లేకపోవడమేనట. 27



శాతం మంది తమకు దగ్గరి స్నేహితులు లేరు అని చెప్పడమే ఆశ్చర్యం అనుకుంటే... ఒక 22 శాతం మంది తమకు అసలు స్నేహితులే లేరని చెప్పారు. ఈ సర్వేకు పరిమితులు ఉండవచ్చు. కానీ ఇప్పటి తరంలో మిత్రుల సంఖ్య తగ్గిపోతుందన్నది అన్నిచోట్లా కనిపిస్తున్నదే. ఇందుకు చాలా కారణాలే ఉండవచ్చు. నగరీకరణ, చదువు ఒత్తిడి లాంటి సందర్భాలతోపాటు... సోషల్ మీడియాది ముఖ్యపాత్ర అని తెలుస్తున్నది. మొబైల్ ఫోన్, సోషల్ మీడియా వల్ల పిల్లల్లో చురుకుదనం తగ్గిపోతున్నదనీ... మొబైల్ వ్యసనం వారి మెదడు పనితీరునే దెబ్బతీస్తున్నదని చాలా పరిశోధనలే చెబుతున్నాయి. దీంతోపాటుగా ఆన్‌లైన్లో అజ్ఞాత 'ఫ్రెండ్స్' పెరుగుతున్న కొద్దీ, నిజమైన మిత్రులు తగ్గిపోతున్నారట. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం చేసిన ఒక పరిశోధనలో సోషల్ మీడియా వాడకం పెరుగుతున్న కొద్దీ ఒంటరితనం కూడా పెరుగుతున్నట్టు గమనించారు. విచిత్రం ఏమిటంటే 52 శాతం కుర్రాళ్లు తమ మిత్రులను కలుసుకున్నా కూడా... వారితో మాట్లాడటం కంటే, పక్కపక్కనే కూర్చుని ఫోన్లో తలదూర్చి కాలాన్ని గడుపుతున్నారని కాన్వే మెడికల్ సెంటర్ పేర్కొంటున్నది. ఆ మాటకు వస్తే ఇతరులతో ముఖాముఖి మాట్లాడగలిగే సామాజిక నైపుణ్యాలు సైతం ఈ సోషల్ మీడియా వల్ల దెబ్బతింటున్నాయనీ, మిత్రులతో కూడా నేరుగా కాకుండా ఆన్‌లైన్లోనే మాట్లాడటానికి ఎక్కువ ఇష్టపడుతున్నారనీ ఈ సంస్థ చెబుతున్నది.

### ఫ్రెండ్‌షిప్ మాంద్యం!

మీరు చదివింది నిజమే. ఉద్యోగాల్లోనూ, ఆర్థిక వ్యవస్థలోనూ మాంద్యాన్ని (రిసెషన్) చూశాం కానీ ప్రస్తుతం ఫ్రెండ్‌షిప్ మాంద్యం నడుస్తున్నదని సర్వేలు వాపోతున్నాయి. 20వ శతాబ్దపు చివరినుంచే ఈ పరిస్థితులు కనిపిస్తున్నా... గత రెండుమూడేళ్లలో

